TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 270 | మంగళవారం 22-09-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

## ఓటరు జాబితాలో పేరు అంశం..

### సోనియా గాంధీకి మళ్లీ చిక్కులు

- ఓటరు జాబితాలో పేరు అంశంలో సోనియాకు మళ్లీ చిక్కులు
- 1980లో ఓటర్‌గా నమోదు చేసుకున్నారని ఆరోపణ
- 1983లో భారత పౌరసత్వం పొందినట్లు పిటిషన్‌లో పేర్కొనడం
- ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పిటిషనర్ విజ్ఞప్తి



2లో▸

## సచివాలయం పనిచేయడానికే..

### సముద్రాన్ని చూస్తూ కూర్చోవడానికి కాదు!



2లో▸

## పశ్చిమాసియా ఉద్రిక్తం..

### ఇరాన్‌లో 'కోడ్ 100' అమల్లోకి..!



2లో▸

## సింగరేణి స్థలాల్లో స్థిర నివాసం ఉన్నవారికి పట్టాలు: శ్రీధర్‌బాబు



సింగరేణి స్థలాల్లో నివసించేవారికి పట్టాలు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు గోదావరిఖని, మంచిర్యాల,

## ప్రజాపాలనలో లాభాల శిఖరానికి ఏపీఎచ్ఎంఈఎల్



2లో

- మూడేళ్లలో రూ.34.20 కోట్ల నికర లాభం
- 2025-26లోనే రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల లాభాలు
- మూసివేత అంచుల నుంచి జాతీయస్థాయి సంస్థగా ఎదిగే దిశగా అడుగులు
- సింగరేణి నిర్వహణ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో కొత్త ఉత్సాహం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో విస్తరణ చర్యలు



## రూ.4.50 కోట్ల కరెన్సీ నోట్లతో గణేశుడికి అలంకరణ

నందిగామ గ్రామీణం: ఎన్టీఆర్ జిల్లా నందిగామ వాసవి మార్కెట్‌లో వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మండపంలో గణపతికి సోమవారం రూ.4.50 కోట్ల కరెన్సీ నోట్లతో అలంకరణ చేశారు. గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 44వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కొత్త కరెన్సీ నోట్లతో అలంకరించారు. దీంతో గణేశుడిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు.

## ఎన్నికలు జరగని 58 గ్రామపంచాయతీలకు

# గుడ్‌న్యూస్..

### మంత్రి సీతక్క చొరవతో రూ.33 కోట్లు నిధులు విడుదల...



2లో▸

- 58 గ్రామపంచాయతీలకు రూ.33.62 కోట్లు
- మంత్రి సీతక్క చొరవతో నిధుల విడుదల
- ఎన్నికలు జరగని గ్రామాలకు రాష్ట్ర నిధులు
- పంచాయతీల ఖాతాల్లో నిధుల జమ
- అభివృద్ధి పనులకు నిధుల వినియోగం
- మౌలిక వసతులు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం
- కేంద్ర నిధులు రాకపోయినా అభివృద్ధి కొనసాగింపు

## బీఆర్ఎస్ శ్రేణుల అణచివేతకు రేవంత్ సర్కార్ కుట్ర: కేటీఆర్



2లో▸

## జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి బీఆర్ఎస్సే కారణం:

- జూరాల నీటి సమస్యకు బీఆర్ఎస్సే కారణమని జూపల్లి
- అదనపు రిజర్వాయర్ ఎందుకు నిర్మించలేదని ప్రశ్న
- రిజర్వాయర్లు లేక నీటి నిల్వ సాధ్యం కాలేదని వ్యాఖ్య
- గూడెందొడ్డి రిజర్వాయర్‌కు రూ.15 టీఎంసీల సామర్థ్యం
- రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు ఇచ్చామని వెల్లడి
- కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 43 శాతం వరకు పెరిగిందని వ్యాఖ్య
- నీటి కేటాయింపుల్లో రాజీపడబోమని స్పష్టం
- వచ్చే సీజన్‌లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు



2లో▸

## జగన్ క్రిమినల్ గ్యాంగులను

# వదిలే ప్రసక్తి లేదు



2లో▸






TGTEL/25/A0827
ప్రజా దివాన్
తెలుగు దినపత్రిక
22-09-2026

# సంపాదకీయం

## ఆఖరి మానవ రచయిత ఇంకా ఎంతెంత దూరం?

సాహిత్యం ఎప్పుడూ ప్రశ్నల మధ్యనే బతికింది. మనిషి ఎవరు? ప్రేమ అంటే ఏమిటి? మరణం తర్వాత మిగిలేదేమిటి? జ్ఞాపకం మనిషిలో ఉంటుందా, మనిషే జ్ఞాపకంలో ఉంటాడా? అన్నవే ఆ ప్రశ్నలు. కాలం మారినప్పుడల్లా ప్రశ్నల రూపం మారింది. ఇప్పుడు కృత్రిమ మేధ సాహిత్యం ముందు నిలబెడుతున్న ప్రశ్నలు మాత్రం మరింత అసౌకర్యమైనవి.
యంత్రం సృష్టించిన సాహిత్యానికి యజమాని ఎవరు? కవి, కలం అనే పాత సమీకరణం ఇప్పుడు ప్రాంప్ట్, కవి, యంత్రం అనే కొత్త త్రికోణంగా మారిందా? సోషల్ మీడియా కవిత్వాన్ని ప్రజాస్వామ్యీకరిస్తోందా, లేక అల్గారిథమ్‌కు అనుగుణంగా కుదిస్తున్నదా? భవిష్యత్ పాఠకుడు పుస్తకాన్ని చదువుతాడా, లేక దానితో మాట్లాడతాడా? యంత్రం కూడా రాయగలిగినప్పుడు మానవ రచయిత ఎందుకు? ఇవీ ఆ కొత్త ప్రశ్నలు.
ఏఐ ఏదైనా సరే అద్భుతంగానే రాసేస్తుందేమోనన్న వాదనను కొట్టిపారేయాల్సిన అవసరం లేదు. "ఏఐ ఎప్పటికీ మనిషిలా రాయలేదు" అని మనల్ని మనం ఓదార్చుకోవడం వంచనే అవుతుంది. అసలు ప్రశ్న-- మనిషి ఎందుకు రాస్తాడు? అన్నది. కొన్నిసార్లు మనిషి బతకడానికి రాస్తాడు. ప్రేమ విఫలమైన తర్వాత రాస్తాడు. జైలులో రాస్తాడు. యుద్ధం మధ్య రాస్తాడు. తనను ఎవరూ విననప్పుడు కాగితానికి చెబుతాడు. అంటే రచన ఒక ఉత్పత్తి మాత్రమే కాదు. ఒక మానవ చర్య. కొన్నిసార్లు సాక్ష్యం. కొన్నిసార్లు ప్రతిఘటన. కొన్నిసార్లు తనను తాను కాపాడుకునే ప్రయత్నం.
మనిషి యంత్రం ముందు కూర్చుని, "కవిత రాయి" అంటున్నాడు. చూడటానికి సాధారణమైన ఈ వాక్యం సాహిత్య చరిత్రలో అసాధారణమైనది. ఇంతకు ముందెప్పుడూ లేనిది. ఇంతకాలం మనిషి తన కథను మరో మనిషికి చెప్పాడు. ఇప్పుడు తనకోసం కథో, కవితో, వ్యాసమో తయారు చేయమని యంత్రాన్ని అడుగుతున్నాడు.
సాహిత్యం మొదట్నుంచీ మనిషిని నిర్వచించడానికి ప్రయత్నించింది. దేవుళ్లు, రాక్షసులు, దయ్యాలు, రోబోలు.. తనకు భిన్నమైన జీవులను ఊహించి వాటిలో తననే చూసుకుంది. ఇప్పుడు ఏఐ ఆ ప్రశ్నను మరింత సంక్లిష్టం చేస్తోంది. మరణించిన భర్త పాత మెయిళ్లు, స్వరం, ఫోటోల ఆధారంగా రూపొందించిన ఏఐ అవతార్‌తో ఒక మహిళ ప్రతిరోజూ మాట్లాడుతుందనుకుందాం. ఆమె ఎవరితో మాట్లాడుతోంది? భర్తతోనా? జ్ఞాపకంతోనా? డేటాతోనా? తన ఒంటరితనంతోనా? ఒక హ్యూమనాయిడ్ "నాకు బాధగా ఉంది" అంటే, అది నిజంగా బాధపడుతోందా అన్నది మాత్రమే ప్రశ్న కాదు. అది బాధపడుతోందని మనిషి నమ్మితే ఆ సంబంధం నిజమవుతుందా? అన్నదే మరింత ఆసక్తికరం.
ఒకప్పుడు కవితను సంపాదకుడు ఎంపిక చేసేవాడు. తర్వాత పాఠకుడు ఎంపిక చేశాడు. ఇప్పుడు అల్గారిథమ్ ఎవరికి ఏ కవిత కనిపించాలో నిర్ణయిస్తోంది. పొడవైన ధ్యానాత్మక కవిత కంటే వెంటనే అర్థమయ్యే పంక్తి వేగంగా ప్రయాణిస్తుంది. రెండోసారి చదివినప్పుడు మాత్రమే తెరుచుకునే కవితకంటే మొదటి మూడు సెకన్లలో ఆకట్టుకునే వాక్యానికి ఎక్కువ అవకాశముంటుంది. ఇక్కడ ప్రమాదం రచన చిన్నదవడం కాదు. పాఠకుడి ఓపిక చిన్నదవడం.
సోషల్ మీడియా కవిత్వానికి ఒక ప్రజాస్వామ్యాన్నిచ్చింది. ప్రచురణకర్త తలుపు మూసిన కవికి అది కిటికీని తెరిచింది. కానీ ప్రతి ప్రజాస్వామ్యం వెంట మార్కెట్ కూడా వస్తుంది. కవిత చదవటమే కాదు, ఎన్ని సెకన్లు చూసారు, ఎన్ని సార్లు షేర్ అయింది అన్నది కూడా ఆ కవిత ప్రయాణాన్ని నిర్ణయిస్తోంది. ఏఐ ఈ వేగాన్ని మరింత పెంచుతోంది. ఒకే భావానికి పదిరూపాలు క్షణాల్లో తయారవుతాయి "ఇంకా విషాదంగా", "మరింత తాత్వికంగా", "ఇంకా వైరల్ అయ్యేటట్టు". ఇక్కడ కవి ఎదుర్కొనే అసలు ప్రమాదం యంత్రం తన స్థానాన్ని ఆక్రమించడం కాదు. తన స్వరాన్ని తానే గుర్తుపట్టలేని స్థితికి చేరడం. ఇక్కడే సృజన కర్తృత్వం అనే ప్రశ్న వస్తుంది. ఒక కవి ఏఐతో "భర్త చనిపోయిన తర్వాత అతని ఖాళీ కుర్చీతో మాట్లాడుతున్న వృద్ధురాలి మీద కవిత రాయి" అంటాడు. సందర్భం మనిషి ఇచ్చాడు. భావోద్వేగ ఉష్ణోగ్రతను మనిషి నిర్ణయించాడు. పదాలను యంత్రం అమర్చింది. అప్పుడు కవిత ఎవరిది?
రచన అంటే వాక్యాలను సమర్థంగా అమర్చడమే అయితే యంత్రమూ రచయితే. కానీ రచన అంటే జీవనానుభవం భాషగా పరివర్తన చెందడం అయితే సమస్య అక్కడ

## ప్రజాపాలనలో లాభాల శిఖరానికి ఏపీఎచ్‌ఎంఈఎల్

మొదటిపేజీ తరువాయి
దాదాపు మూడు దశాబ్దాల క్రితం రూ.21 కోట్ల పేరుకుపోయిన నష్టాలు.. మూతపడే పరిస్థితి.. కానీ, సింగరేణి ఆధీనంలోకి వచ్చిన తర్వాత నుంచి ఇప్పటి వరకు రూ.60.85 కోట్ల లాభాలు (సంచిత లాభాలు). అందులోనూ గత మూడేళ్లలోనే రూ.34.20 కోట్ల నికర లాభాలు ఆర్జించడం విశేషం. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ రంగ సంస్థగా మనుగడే ప్రశ్నార్థకంగా మారిన ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఏపీఎచ్‌ఎంఈఎల్) ఇప్పుడు సింగరేణి అనుబంధ సంస్థగా ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత లాభాల బాటలో దూసుకుపోతోంది.
ముఖ్యంగా గత మూడేళ్లుగా సంస్థ ఆర్థిక పనితీరు గణనీయంగా మెరుగుపడింది. 2023 డిసెంబరులో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి విస్తరణతోపాటు దాని అనుబంధ సంస్థ ఏపీఎచ్‌ఎంఈఎల్‌ను జాతీయస్థాయి సంస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చేపట్టిన చర్యలు సంస్థకు నూతన జవసత్వాలను అందించాయి.
సింగరేణితోపాటు ఇతర భారీ పరిశ్రమలకు యంత్రాలు, వాటి విడిభాగాలను తయారు చేసి సరఫరా చేస్తున్న ఏపీఎచ్‌ఎంఈఎల్ తన 50 ఏళ్ల చరిత్రలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.
మూడేళ్లుగా వరుస లాభాలు
ఒకప్పుడు తీవ్ర నష్టాలతో మూసివేత అంచులకు చేరిన ఏపీఎచ్‌ఎంఈఎల్ ఇప్పుడు వరుసగా లాభాలను నమోదు చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.05 కోట్లు, 2024-25లో రూ.9.87 కోట్లు, 2025-26లో రూ.23.33 కోట్ల నికర లాభాలను సాధించడం విశేషం. దీంతో 1998-99 లో సింగరేణి ఆధీనంలోకి వచ్చిన తర్వాత నుంచి ఇప్పటి వరకు(2025-26 ) సంస్థ ఆర్జించిన మొత్తం లాభాలు రూ.60.85 కోట్లకు చేరాయి.
జాతీయ స్థాయికి ఏపీఎచ్‌ఎంఈఎల్
రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ, దిశానిర్దేశంతో సింగరేణి నాయకత్వంలో ఏపీఎచ్‌ఎంఈఎల్‌ను జాతీయ స్థాయిలో పోటీపడే సంస్థగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. గత ఏడాది ఆగస్టులో ఉప ముఖ్యమంత్రి స్వయంగా ఏపీఎచ్‌ఎంఈఎల్ ప్లాంటును సందర్శించి సంస్థ పనితీరు, అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. సంస్థ కేవలం తెలుగు రాష్ట్రాల్లోని పరిశ్రమలకు మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.
మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కొత్త తరహా యంత్రాలు, యంత్ర విడిభాగాలను తయారు చేయడంతోపాటు ఉత్పత్తులను విస్తరించి కొత్త మార్కెట్లను సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్లాంటులో పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించి కార్మికులతో మాట్లాడి వారిని ప్రోత్సహించారు.
సింగరేణి నుంచి.. దేశంలోని దిగ్గజ సంస్థల వరకు
గతంలో ప్రధానంగా సింగరేణి వంటి సంస్థలకు యంత్రాలు, విడిభాగాలను సరఫరా చేసిన ఏపీఎచ్‌ఎంఈఎల్ ఇప్పుడు తన మార్కెట్‌ను దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. బీహెచ్‌ఈఎల్, జెన్‌కో, ఎన్‌ఎండీసీ, ఆర్‌ఐఎన్‌ఎల్ వంటి ప్రముఖ సంస్థలకు కూడా యంత్రాలు, విడిభాగాలను సరఫరా చేస్తూ జాతీయస్థాయిలో తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది.

## బీఆర్ఎస్ శ్రేణుల అణచివేతకు రేవంత్ సర్కార్ కుట్ర: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: జూరాల ఆయకట్టుకు సాగునీరిచ్చి పంటను కాపాడాలని డిమాండ్ చేసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.
"కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను ప్రభుత్వం తీర్చాల్సిందిపోయి, న్యాయమైన డిమాండ్‌తో నిరసనకు సిద్ధమైన రైతులను, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ సర్కార్ కుట్ర చేస్తోంది. మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించడం రేవంత్ రాక్షస మనస్తత్వానికి నిదర్శనం. వందలాది రైతులను కూడా పోలీసులు అడ్డుకుని నిర్బంధించడం రాష్ట్రంలో సాగుతున్న అణచివేతకు ఉదాహరణ. సీఎంగా విఫలమైన రేవంత్ తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే జిల్లాలోని అనేక మండలాల్లో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలకు చీకటి ఆదేశాలిచ్చారు.
జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా కూడా విడుదల చేయకుండా కుంటిసాకులతో ప్రభుత్వం పచ్చని పంటల ఉసురు తీస్తోంది. తమ పంటలను కాపాడుకునే ఏకైక తపనతో రైతులు జూరాల గేట్లు ఎత్తే ప్రయత్నం చేస్తే వారిపై అక్రమ కేసులు బనాయించింది. తెలంగాణ గడ్డపై ఉన్న జూరాల ప్రాజెక్టు పరిసరాల్లోకి రైతులు రాకుండా ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేసి వందలాది పోలీసులను చుట్టుపక్కల మోహరించడం.. వస్తున్న రైతులను అడ్డగించి అరెస్టులు చేయడం ముమ్మాటికీ సిగ్గుమాలిన చర్య. అక్రమంగా అరెస్టు చేసిన రైతులు, బీఆర్ఎస్ నేతలను ప్రభుత్వం విడుదల చేయడంతోపాటు జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## సింగరేణి స్థలాల్లో స్థిర నివాసం ఉన్నవారికి పట్టాలు: శ్రీధర్‌బాబు

మొదటిపేజీ తరువాయి
గోదావరిఖని, మంచిర్యాల, మందమర్రి, ఖమ్మం జిల్లా కొత్తగూడెం, ఇల్లెందు ప్రాంతాలకు సంబంధించి సింగరేణి స్థలాల్లో స్థిర నివాసం ఏర్పరచుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఆదివారం మంథని పట్టణంలోని రావుల చెరువు కట్ట హనుమాన్ ఆలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో భట్టి విక్రమార్క సింగరేణి ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పరచుకున్న వారి పట్టాలను క్రమబద్ధీకరించారని గుర్తుచేశారు. ఇంకా మిగిలిన వారి స్థలాలకు సంబంధించి కమిటీ ఏర్పాటు చేసుకొని పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## జగన్ క్రిమినల్ గ్యాంగులను వదిలే ప్రసక్తి లేదు

మొదటిపేజీ తరువాయి
అమరావతి: పూజించాల్సిన గురువులపై దాడి చేసిన జగన్ క్రిమినల్ గ్యాంగులను వదిలే ప్రసక్తి లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. వైకాపా ప్రేరేపిత రౌడీ షీటర్లు, గంజాయి- బ్లేడ్ బ్యాచుల పనిపడతామని.. ప్రభుత్వ బడులు, టీచర్ల జోలికి ఆ పార్టీ రావడం మానుకోవాలని హెచ్చరించారు. విజయవాడలో స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైకాపా నేతల దాడిని ఖండిస్తూ మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు.
"అందరూ దైవంలా భావించే గురువులను వైన్ షాపులకు కాపలా పెట్టిన జగన్.. ఉపాధ్యాయులను గౌరవిస్తారని అనుకోవడం మన భ్రమ. అత్యుత్తమ ఆటతీరుతో రాష్ట్రం, దేశం సత్తా ప్రపంచానికి చాటిన క్రీడాకారులపై.. స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు అంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే ఆయన దుర్బుద్ధి బయటపడింది. స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైకాపా ఫ్యాక్షన్ ముఠా శాప్ కార్యాలయం వద్ద దాడికి దిగింది. రౌడీ షీటర్లు, గంజాయి-బ్లేడ్ బ్యాచులను టీచర్లపైకి ఉసిగొల్పడం జగన్ నేర మనస్తత్వాన్ని బయటపెట్టింది. జగన్ క్రిమినల్ గ్యాంగులను వదిలే ప్రసక్తి లేదు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని లోకేశ్ స్పష్టం చేశారు.
కేసుల నమోదుకు ఆదేశం..
ఉపాధ్యాయులపై గూండాల దాడి ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దాడిలో పాల్గొన్న ఎవరినీ వదిలి పెట్టవద్దని విజయవాడ సీపీకి ఆదేశాలు జారీ చేసింది. సీసీటీవీ, వీడియో ఫుటేజీల ద్వారా దాడిలో పాల్గొన్న వారిని పోలీసులు గుర్తిస్తున్నారు. నాలుగు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ర్యాలీలు, దాడుల్లో పాల్గొన్న రౌడీషీటర్లను వెంటనే అరెస్టు చేయాలన్నారు. మాచవరం, సూర్యారావుపేట, కృష్ణలంక పీఎస్‌లలో కేసుల నమోదు చేయనున్నారు. కర్రలు, రాడ్లు, రాళ్లు, గుడ్లు తేవడంపై పక్కా ప్లాన్ ఉందని పోలీసు అధికారులు అనుమానిస్తున్నారు.

## జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి బీఆర్ఎస్సే కారణం:

మొదటిపేజీ తరువాయి
జూరాల: జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి బీఆర్ఎస్సే కారణమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జూరాల దగ్గర అదనపు రిజర్వాయర్ ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాలలో ఆయన ఈమేరకు మాట్లాడారు. వరద లేని పరిస్థితుల్లో గేట్లు ఎత్తితే తాగునీటికి ఇబ్బంది కాదా? అని ప్రశ్నించారు.
"కేసీఆర్ గతంలో 20 టీఎంసీల గట్టు రిజర్వాయర్‌ను తీసుకొస్తామని చెప్పారు. జూరాల, భీమా ఆయకట్టుకు సింగోటం నుంచి నీళ్లు తెస్తామన్నారు. పాలమూరుపై అంత ప్రేమ ఉంటే రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదు? కేసీఆర్ రిజర్వాయర్లు కట్టకపోవడం వల్లే నీళ్లను నిల్వ చేసుకోలేకపోతున్నాం. పాలమూరు జిల్లాను ఎండబెట్టే ప్రయత్నం చేశారు. కేసీఆర్ హయాంలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 30 శాతానికి మించలేదు. మా ప్రభుత్వంలో ఈ వాటా 43 శాతం వరకు ఉంది. నీటి కేటాయింపుల విషయంలో కాంగ్రెస్ సర్కారు రాజీపడదు. 15 టీఎంసీలతో గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు ఇచ్చాం. ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి ఇంకా నీళ్లు వస్తాయని భావిస్తున్నాం. ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లను సరైన పద్ధతిలో ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నాం. వచ్చే సీజన్‌కు నీటి ఎద్దడి లేకుండా చేస్తాం" అని అన్నారు.

## స్పీకర్‌ను దూషించిన కేసు.. తాతా మధు, నవీన్‌రెడ్డికి హైకోర్టు నోటీసులు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను దూషించిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వారిని అరెస్టు చేయొద్దంటూ గతంలో నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పోలీసులు హైకోర్టును ఆశ్రయించారు. నాంపల్లి కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. పీపీ నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌ను తాతా మధు, నవీన్‌రెడ్డి అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులపైనా దాడి చేశారని చెప్పారు. ఈక్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డికి ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

## ఓటరు జాబితాలో పేరు అంశం..

మొదటిపేజీ తరువాయి
ఓటరు జాబితాలో పేరు అంశంలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ కి మళ్లీ చిక్కులు ఎదురయ్యాయి. భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ.. గతేడాది కోర్టులో పిటిషన్ దాఖలయ్యింది. ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఈ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఆ పిటిషన్‌ను మేజిస్ట్రియల్ కోర్టు తిరస్కరించింది. ఆ ఉత్తర్వును సవాల్ చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌పై తాజాగా దర్యాప్తు చేపట్టిన దిల్లీ న్యాయస్థానం.. ఆ తీర్పును పక్కనబెట్టింది. దీంతో సోనియా పౌరసత్వ అంశంపై దర్యాప్తునకు మార్గం సుగమం అయ్యింది.
మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులు సరైన వివరణ లేనివని పేర్కొంటూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే వాటిని కొట్టివేశారు. చట్టపరమైన నియమాలు పాటించకపోవడం, సంబంధిత అధికారి వాదనలను వినకపోవడం వంటి అనేక లోపాలు ఈ ఉత్తర్వులో ఉన్నట్లు గుర్తించామన్నారు.తదుపరి విచారణను సెప్టెంబర్ 29కి వాయిదా వేశారు.
ఏమిటీ కేసు..?
1983లో సోనియాగాంధీకి భారత పౌరసత్వం వచ్చింది. అయితే 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గతేడాది ఆగస్టులో భాజపా నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అందులో గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు సోనియా పేరును చేర్చారని పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని రాసుకొచ్చారు. పౌరసత్వం లేని సోనియా పేరును ఓటరు జాబితాలో చేర్చి అప్పటి కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిందని ఆరోపించారు.

## సచివాలయం పనిచేయడానికే..

మొదటిపేజీ తరువాయి
చెన్నై పట్టినపాక్కంలోని శీనివాసపురం వద్ద నూతన సచివాలయం (ూవఎతీమ్ఖతీఱఖ్) నిర్మించడానికి విజయ్ సర్కార్ చర్యలు చేపడుతోంది. ఈ ప్రతిపాదనపై డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎంకే స్టాలిన్ (వీఖ క్ఖుశ్రీఱఅ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే స్థానిక మత్స్యకార సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా భారీ నిరసన చేపడతామని హెచ్చరించారు. మెరీనా బీచ్ సమీపంలో సెక్రటేరియట్ నిర్మాణాన్ని ప్రజలు, మత్సకారులు వ్యతిరేకిస్తున్నా విజయ్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. సెక్రటేరియట్ ఉండేది పని చేయడానికే తప్ప.. సీఎం సముద్రాన్ని చూస్తూ కూర్చోవడానికి కాదని ఎద్దేవా చేశారు.
మత్స్యకారుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని.. పట్టినపాక్కంలో కొత్త సచివాలయం నిర్మాణ ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని స్టాలిన్ డిమాండ్ చేశారు. వారి జీవనోపాధి, పరిసరాలను నాశనం చేసి మరీ నూతన సచివాలయం నిర్మించాల్సిన అవసరం లేదన్నారు. ఆ ప్రాంతంలో స్థానిక జాలర్లకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.
సచివాలయాన్ని మా సమాధులపైనే కట్టాలి
మరోవైపు, కొత్త సచివాలయం నిర్మించనున్నట్లు ప్రభుత్వ జీవో విడుదల కావడంతో ముల్లికుప్పం శీనివాసపురం, ముల్లిమానగర్, రాజీవ్‌గాంధీ నగర్, నంబిక్కై నగర్, భవాని కుప్పం, డుమ్మింగ్ కుప్పం, ఇరుదయరాజపురం, సెల్వరాజ్‌పురం, నొచ్చినగర్, నొచ్చికుప్పం తదితర మత్స్యకార గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు (ఖీఱంప్త్రవతీఎవఅం ూతీశేవర్) చేపట్టారు. కొత్త సచివాలయాన్ని నిర్మిస్తే తమ జీవనాధారం దెబ్బతింటుందని, తమ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తం..

మొదటిపేజీ తరువాయి
పశ్చిమాసియాలో ఘర్షణలు ఎప్పుడు ఏ రూపం దాల్చుతాయో తెలియని ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ తన సాయుధ దళాలకు "కోడ్ 100" (జశీవ 100) అలర్ట్‌ను జారీ చేసినట్లు సమాచారం. ఈ అలర్ట్‌ను ఆ దేశ అత్యున్నత స్థాయి సైనిక సన్నద్ధతగా రక్షణరంగ నిపుణులు అభివర్ణిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్యాంప్ డేవిడ్ (వారాంతంలో విశ్రాంతి తీసుకునే ప్రదేశం) నుంచి షెడ్యూల్ సమయం కంటే ముందుగానే వైట్‌హౌస్‌కు తిరిగిరావడం, ఈ అలర్ట్ జారీ కావడం దాదాపు ఒకేసారి జరిగాయి. దాంతో పశ్చిమాసియాలో భీకరదాడులు జరుగుతాయా..? అనే సిగ్నల్ ప్రపంచానికి వెళ్లింది.
ఏంటీ కోడ్ 100 అలర్ట్..?
ఈ కోడ్ 100 అలర్ట్ (జశీవ 100)ను ఇరాన్ సాయుధ దళాలకు అత్యున్నత స్థాయి సంసిద్ధతగా చెబుతుంటారు. ఇది అమలు చేయడమంటే.. తమ దేశంపై జరగబోయే దాడికి దీటుగా స్పందించడానికి సైనిక, భద్రతా దళాలను సంసిద్ధంగా ఉంచడమే. దళాలను అవసరమైన చోట వేగంగా మోహరించేలా, యుద్ధప్రాతిపదికన సైనిక సమాచార మార్పిడి తగ్గట్టుగా చర్యలు ఉంటాయి. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి భీకరదాడులు జరుగుతాయా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, ఈ కోడ్ 100 అలర్ట్‌పై ఇరాన్ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటనా రాలేదు.
ప్రస్తుతం పశ్చిమాసియాలో అమెరికా మిత్ర దేశం సౌదీ అరేబియా, ఇరాన్ మద్దతున్న హూతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. సౌదీ చమురు ఎగుమతులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కీలకమైన ఈస్ట్-వెస్ట్ ఆయిల్ పైప్‌లైన్ (పెట్రో లైన్) మూసివేయాల్సి వచ్చింది. సౌదీ రాజధాని రియాద్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. రియాద్ సహా పరిసర ప్రాంతాలపై తాము క్షిపణి, డ్రోన్ దాడులు చేసినట్లు హూతీలు ప్రకటించగా.. వాటిని తాము అడ్డుకున్నామని సౌదీ ప్రకటించింది. హూతీలపై దాడులకు దిగే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందంటూ ఒక దశలో వార్తలు వచ్చాయి.
వాటి కోసమే ట్రంప్ క్యాంప్ డేవిడ్‌లో తన పర్యటనను కుదించుకుని షెడ్యూల్ కంటే ఒక రోజు ముందుగానే శ్వేతసౌధానికి చేరుకున్నారని పలు కథనాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియాలో దాడులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండడంతో ఆయా దేశాల్లో ఉన్న తమ పౌరులు అప్రమత్తంగా ఉండాలని అగ్రరాజ్యం సూచించింది. ఆ సమయంలో ఇరాన్ కోడ్ 100 (జశీవ 100)ను యాక్టివేట్ చేసిందన్న మీడియా కథనాలు వెలువడ్డాయి.

## ఎన్నికలు జరగని 58 గ్రామపంచాయతీలకు గుడ్‌న్యూస్..

మొదటిపేజీ తరువాయి
ఎన్నికలు జరగని 58 గ్రామపంచాయతీలకు గుడ్‌న్యూస్.. మంత్రి సీతక్క చొరవతో రూ.33 కోట్లు నిధులు విడుదల...
తెలంగాణలో ఎన్నికలు జరగని 58 గ్రామ పంచాయితీలకు గుడ్ న్యూస్ చెప్పింది ప్రభుత్వం. కోర్టు కేసులు, ఇతర కారణాలతో ఎన్నికలు జరగని గ్రామ పంచాయితీలకు అండగా నిలిచింది రాష్ట్ర ప్రభుత్వం. ఎన్నికలు జరగలేదన్న కారణంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయిన క్రమంలో కీలక నిర్ణయం తీసుకుంది రాష్ట్ర ప్రభుత్వం. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఎన్నికలు జరగని 58 గ్రామ పంచాయితీలకు రాష్ట్ర నిధులు విడుదల చేశారు. ప్రపంచపటాలు పరిశీలించండి
గ్రామ పంచాయితీలు నష్టపోకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 58 గ్రామపంచాయతీలకు రూ.33.62 కోట్ల నిధులు విడుదల చేసింది ప్రభుత్వం.ఈమేరకు ఆయా గ్రామపంచాయతీల ఖాతాల్లో నిధులు జమ చేసింది ప్రభుత్వం.
ఎన్నికలు జరగలేదని గ్రామాల అభివృద్ధి ఆగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు మంత్రి సీతక్క. కేంద్ర నిధులు రాకపోయినా.. గ్రామాల అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
ఈ నిధులను ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, మరియు ఇతర అత్యవసర సమగ్ర అభివృద్ధి పనుల కోసం వినియోగించనున్నారు.ఎన్నికలు జరగకపోయినా గ్రామాల ప్రగతి కుంటుపడకూడదనే ఉద్దేశంతో మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ నిధులు విడుదల చేయించడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో గణనాథునికి ప్రత్యేక పూజలు.

**– భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జన కార్యక్రమం..**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్





గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహానికి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడు ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలను ప్రసాదించాలని, ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది చేపట్టిన ప్రతి కార్యం ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యేలా ఆశీర్వదించాలని మహాగణపతిని ప్రార్థించినట్లు తెలిపారు.గత ఏడు రోజులుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో విశేష పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ శోభాయాత్రను ప్రారంభించారు.పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని డప్పు వాయిద్యాల నడుమ కోలాటాలు, ఆటపాటలతో గణనాథునికి వీడ్కోలు పలికారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంలో సహకరించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు.ఈకార్యక్రమంలో డిఎస్పీ లు, సి.ఐ లు, ఆర్.ఐ లు,ఎస్.ఐ లు, కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయుర్వేదంతో ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యం

**– 11వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మెడిటేషన్, పోషణ అవగాహన కార్యక్రమాలు**

వేములవాడ / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్




రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని ఆయుష్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్వో కార్యాలయం సమీపంలోని పార్కులో మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి, మానసిక ప్రశాంతతకు ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 11వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, పిల్లలు, వృద్ధులకు సమతుల ఆహారం, పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. రోజువారీ ఆహారంలో తీసుకోవాల్సిన పోషక పదార్థాలు, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుర్వేదం మన జీవన విధానానికి మార్గదర్శకమైన వేదమని, ఆయుర్వేద పద్ధతులను అనుసరించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శారీరక, మానసిక సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ సంగీత, అంగన్‌వాడీ టీచర్ ఎస్. జ్యోతి, ఎన్‌డీపీఓ, ఫార్మసిస్ట్ పుష్పలత, యోగా టీచర్ ఎలిగేటి కృష్ణ, రిషిక, డీపీఎం తిరుపతి తదితరులు పాల్గొన్నారు. మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు

ముస్తాబాద్/ సెప్టెంబర్ 21 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారం పద్మశాలి సంఘం అధ్యక్షుడు తడుక బాలకిషన్ ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఆయన పేద ప్రజలకు, తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గౌడ కృష్ణారి, బిట్ల దేవానందం, సత్యనారాయణ, వంశీ, ఆంజనేయులు, మల్లేశం, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# కవితక్క ముఖ్యమంత్రి అయ్యేవరకు శ్రమిస్తాం ....

**– సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్**

వీర్నపల్లి సెప్టెంబర్ 21 ప్రజా దివాస్

పాంచ జన్య పథకాలతో రాష్ట్రాన్ని, బడుగు, బలహీన వర్గాలను అభివృద్ధి పరిచే లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ప్రజాసేవలోకి నిత్యం ఉద్యమిస్తున్నందున కవితక్క ముఖ్యమంత్రి అయ్యేవరకు శ్రమిస్తామని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్ అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గం లోని వీర్నపల్లి మండల కేంద్రంలో సోమవారం నియోజకవర్గ మహిళా ఇన్చార్జ్ కదిరే రేణుక, మండల నాయకురాలు పోతారం పద్మ, మండల నాయకులు బండి శ్రీహరి, యువ నాయకుడు జావిద్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుండి 50 మంది టిఆర్ఎస్ లో చేరారు. టిఆర్ఎస్ లో చేరడానికి వచ్చిన కార్యకర్తలను సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ కవితక్క ప్రవేశపెట్టిన పాంచ జన్య పథకాలు తమకు బాగా నచ్చాయని అందుకోసమే తాము స్వచ్ఛందంగా కవితక్కను ముఖ్యమంత్రి చేయాలని ఉద్దేశంతో పార్టీలో జాయిన్ కావడం జరిగిందని మహిళలు చెప్పడం సంతోషకరమన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం టిఆర్ఎస్ పార్టీ చీఫ్ కవితక్క అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మహిళలు, యువకులు కవితక్కకు బ్రహ్మరథం పట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవితక్క ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించడం జరుగుతుందని, కవితక్క ప్రతిపాదిస్తున్న పాంచజన్య పథకాలు, ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం వంటి ప్రజా సంక్షేమ విధానాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు రావడం జరుగుతుందన్నారు. మహిళలు పార్టీలో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాంచజన్య సూత్రాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్ళి, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో



రాజకీయాల్లోకి రావాలన్నారు. ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతం చేయాలని మజీద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోనేటి పర్శయ్య, బొమ్మన వేణి పరశరాములు, పోతారం మహేష్, సల్మాల ముత్తవ్వ, నీరటి సుమలత, క్యారం సుకన్య, గంగాధరి కృప, పద్మ, సుమలత, గంగవ్వ, దేవవ్వ, సుకన్య, రాజవ్వ, దేవవ్వ, సుమలత, శివ రాజవ్వ, సత్తవ్వ, శకుంతల, రజిత, జ్యోతి, పూర్ణ, లక్ష్మి, లత, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

**– జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**– ఐడీఓసీలో 172 దరఖాస్తుల రాక**
**– రెవెన్యూ డివిజన్ కార్యాలయాలకు 18**
**– ఎంపీడీఓ కార్యాలయాలకు మొత్తం 59 దరఖాస్తుల రాక**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్

ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.అధికారులు ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కాగా ప్రజావాణికి మొత్తం 172 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు.సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 08 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 10 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

**మండలాల్లో స్వీకరణ**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ప్రజావాణి ఎంపీడీఓ లు నిర్వహించి.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

**మండలాల వారీగా దరఖాస్తులు వివరాలు..**

బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 03, చందుర్తి మండలం 03, ఇల్లంతకుంట మండలం 04, గంభీరావుపేట మండలం 05, కోనరావుపేట మండలం 02, ముస్తాబాద్ మండలం 16, రుద్రంగి మండలం 01, తంగళ్లపల్లి మండలం 03, వీర్నపల్లి మండలం 05, వేములవాడ అర్బన్ మండలం 03, వేములవాడ రూరల్ మండలం11, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 03 చొప్పున వచ్చాయి. మండల, డివిజన్ స్థాయిలో




ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని చోట్ల అప్లికేషన్లు ఆన్లైన్ చేస్తారని పేర్కొన్నారు. ఐడీఓసీ ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# నామినేటెడ్ పదవుల్లో మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలి

**– పదవులు దక్కకపోవడంపై మండల స్థాయిలో మాదిగల అంతర్గత సమావేశం**
**– మూకుమ్మడి రాజీనామాలపై చర్చ జరుగుతోందన్న ప్రచారం**

కోనరావుపేట మండలం / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్

కోనరావుపేట మండల పరిధిలోని అధికార పార్టీ లో రాజకీయ, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న మాదిగ సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదనే అంశంపై మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు అంతర్గత సమావేశం నిర్వహించినట్లు సమాచారం. మండలంలో మాదిగ సామాజిక వర్గానికి గణనీయమైన జనాభా, ఓటు ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ నామినేటెడ్ పదవులు, మార్కెట్ కమిటీలు, వివిధ కమిటీలు, పార్టీ పదవులు తదితర విషయాల్లో తగిన ప్రాతినిధ్యం లభించడం లేదనే అభిప్రాయాలను సమావేశంలో పలువురు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "ఓటు సమయంలో మాదిగల ప్రాధాన్యత గుర్తుకు వస్తుంది.. పదవుల పంపకంలో మాత్రం ఎందుకు గుర్తుకు రావడం లేదు" అనే ప్రశ్నను పలువురు నాయకులు లేవనెత్తినట్లు సమాచారం. సామాజికంగా, రాజకీయంగా మాదిగలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నట్లు తెలిసింది. ఇదిలా




ఉండగా, ప్రస్తుత పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కొందరు నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా రాజీనామాలు చేయాలా లేక పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తీసుకురావాలా అనే అంశంపై కూడా చర్చించినట్లు మండలవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అయితే రాజీనామాలపై తుది నిర్ణయం తీసుకున్నట్లు అధికారికంగా వెల్లడించలేదు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు నామినేటెడ్ పదవులు, కమిటీలు, పార్టీ బాధ్యతల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని, సామాజిక న్యాయం పాటించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై పార్టీ అధిష్ఠానం మరియు ప్రజాప్రతినిధులు స్పందించి మాదిగ నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు. "ప్రాతినిధ్యం కోసం ప్రశ్నించడం ఎవరికీ వ్యతిరేకం కాదు. సామాజిక న్యాయం కోసం జరిగే ప్రజాస్వామ్య పోరాటం" అని సమావేశంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నట్లు సమాచారం.

# భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలి

**- 2026--27లో భూసేకరణకు రూ.6 వేల కోట్ల నిధులు విడుదల**
**- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
**- నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రులు, సీఎస్**
**- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణతో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల





చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించారని తెలిపారు.

2026--27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు ప్రభుత్వం నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్లు భూ సేకరణ పరిహారం నిర్వాసితులకు పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. భూసేకరణ నిబంధనల ప్రకారం జరగాలని ఆదేశించారు.భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే హైదరాబాద్‌లోని భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు.రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎల్ నినో నేపథ్యంలో రానున్న సీజన్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్తాబాద్ మండల బైండ్ల సంగం నూతన కార్యవర్గం ఎన్నిక

**- అధ్యక్షులుగా గొట్టే ప్రశాంత్**

ముస్తాబాద్ / సెప్టెంబర్ 21 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం లో సోమవారం రోజున ఎల్లమ్మ తల్లి దేవాలయం ఆవరణలో ముస్తాబాద్ మండల బైండ్ల సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసుకొని అందరి సమక్షంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా గొట్టే ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా బత్తుల ఎల్లం, ప్రధాన కార్యదర్శిగా గొట్టే రమేష్, కార్యదర్శిగా గొట్టే బాబు, కోశాధికారిగా గొట్టే నాగరాజ్, గొట్టే సుమన్ మండల ఆర్గనైజర్ గా గొట్టె చంద్రశేఖర్, బత్తుల రాజనర్స్, రైటర్ గా గొట్టే నాగరాజ్, గొట్టే శంకర్ లను మండల సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వారన్నారు ఈ సందర్భంగా అధ్యక్షులు ప్రశాంత్ మాట్లాడుతూ బైండ్ల సంఘ సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సంఘ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని నూతన కార్యవర్గ ఎన్నికలకు సహకరించిన ప్రతి ఒక్క కుల బాంధవులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# ఉద్యోగ ఉపాధి కోసం ప్రజావాణిలో వినతి పత్రం అందించిన

**- దివ్యాంగుడు మినుప రాజు**

ముస్తాబాద్/ సెప్టెంబర్ 21 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామానికి చెందిన మినుప రాజు అనే దివ్యాంగుడు తనకు ఉపాధి లేక మానసిక వేదనతో కాలం గడుపుతున్న పరిస్థితి నేను ఏమీ పాపం చేశాను దేవుడికి శారీరక వైకల్యం ఉన్నప్పటికీ పట్టుదలతో డిగ్రీ పూర్తి చేసిన దివ్యాంగ యువకుడు, ఉపాధి లభించక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఎదురుచూపులు చూస్తున్నాడు అర్హతకు తగిన ఉద్యోగం లేక వృద్ధురాలైన తల్లితో కలిసి జీవనం కొనసాగిస్తున్న వికలాంగుడు తన తండ్రి మరణ అనంతరం బయట పనిచేయడానికి వైకల్యం అడ్డు కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి ప్రభుత్వాలు ఎన్ని ఉన్న దివ్యాంగుల పరిస్థితి దీనంగా మారింది ఉపాధి లేక దిన దినం గండం గా మారిందని ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించి దివ్యాంగుడైన నాకు ఉద్యోగ అవకాశం కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందించిన దివ్యాంగుడి మనోవేదన

# ప్రాథమిక పాఠశాలల్లో వెంటనే విద్యా వాలంటీర్లను నియమించాలి: టిఆర్‌టిఎఫ్

**- జీవో 25ను వెంటనే సవరించాలి: బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, బోయన్నగారి నారాయణ**
**- డీఎస్సీ ద్వారా ఎస్జీటీ పోస్టులను శాశ్వతంగా భర్తీ చేయాలి**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్

ప్రాథమిక పాఠశాలల్లో తీవ్రంగా ఉన్న ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం వెంటనే విద్యా వాలంటీర్లను నియమించాలని, జీవో 25ను వెంటనే సవరించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్టిఎఫ్) రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. బోయినపల్లి మండలంలో నిర్వహించిన టిఆర్టిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, ప్రధాన






కార్యదర్శి బోయన్నగారి నారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యాబోధనకు తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. 70 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో కేవలం ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటం ప్రాథమిక విద్యకు శ్రేయస్కరం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థలోని కిందిస్థాయి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో అధికారులు విఫలమవుతున్నారని, సర్ ప్లస్ టీచర్లు ఉన్నారంటూ పత్రికల్లో వస్తున్న వార్తలు వాస్తవం కాదని స్పష్టం చేశారు.ఉపాధ్యాయ కొరతను తాత్కాలికంగా తీర్చడానికి విద్యా వాలంటీర్లను నియమించడంతో పాటు, శాశ్వత ప్రాతిపదికన డీఎస్సీ నిర్వహించి ఎస్జీటీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం ఉపాధ్యాయుల కొరతను వెంటనే తీర్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టిఆర్టిఎఫ్ బోయినపల్లి మండల అధ్యక్షుడు సిరిపురం రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి చిలకపాటి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు శ్రీరాముల సతీష్, నాయకులు నరేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై జ్యోతిని సన్మానించిన ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు.

ముస్తాబాద్/ సెప్టెంబర్ 21 ప్రజా దివాస్



నవరాత్రి ఉత్సవాల లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పట్టణములో శివ కేశవ ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నెల కల్పిన గణపతి దేవుడికి ఆర్యవైశ్య మహిళలు సోమవారం 108 నైవేద్యాలను సమర్పించారు.

అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై జ్యోతి వినాయకుడి వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్సై జ్యోతిని ఆర్యవైశ్య మహిళ సంఘం సభ్యులు ఘనముగా శాలువాతో సన్మానించి జ్ఞాపకను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు కూర సంతోష్, గౌరవ అధ్యక్షులు కూర బిక్షపతి, కార్యదర్శి పప్పుల శ్రీకాంత్, ఆర్య వైశ్య నాయకులు బండారి సత్తయ్య, మేడిశెట్టి రాజు, కాసన గోట్టు శ్రీనివాస్, పడమటింటి శంకరయ్య, ఆర్యవైశ్య మహిళా సభ్యులు మంజుల, జయ లక్ష్మి, పద్మజ, లావణ్య, సుజాత, మమత అన్నపూర్ణ, హిమ బిందు, రజిత, సరిత, లక్ష్మి, దివ్య , వీరజ, దుర్గ వీణ, వీరమని, సంధ్య, రాణి, భవాని, లత, రాధ, విజయ, పద్మ, స్వప్న, గోదావరి, సరళ, వరలక్ష్మి, నవ్య, ప్రియాంక, వీణ, రజిని, భాగ్య, మరి కొంతమంది ఆర్యవైశ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే చిన్నారుల సంపూర్ణ ఎదుగుదల...

**- బాల్ నగర్ అంగన్వాడి సెంటర్ లో 9వ మాస పోషణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన**
**- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

వేములవాడ / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్

పట్టణంలోని 15వ బాల్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో 9వ మాస పోషణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు,ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు,చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా, నిర్ణీత సమయంలో అందేలా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పర్యవేక్షణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార పదార్థాలు సకాలంలో అందుతున్నాయా లేదా అనే విషయాలను తెలుసుకోవడంతో పాటు, పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పోషణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు.చిన్నారులకు





సమతుల్యమైన, పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని అన్నారు. గర్భిణీలు, బాలింతలు కూడా పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జణూూ, అంగన్వాడీ టీచర్, ఆశా వర్కర్, మున్సిపల్ వార్డు ఆఫీసర్, అంగన్వాడీ సిబ్బంది, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో పశువుల పాక నిర్మాణానికి శ్రీకారం

**– రైతులు, పశుపోషకుల సంక్షేమమే ధ్యేయం: సర్పంచ్ ముత్త సంజన మహేష్**

వేములవాడ / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్





వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి గ్రామంలో విబిజి రాంజీ (ఎదీ+ రాంజీ) నిధులతో చేపట్టిన పశువుల పాక నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని పశు పోషకులకు మెరుగైన వసతులతో పాటు పశువులకు రక్షణ కల్పించే లక్ష్యంతో ఈ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముత్త సంజన మహేష్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధితో పాటు రైతులు, పశుపోషకుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. పశు వులకు రక్షణతో కూడిన అనుకూలమైన వసతి కల్పించడం ద్వారా రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మనోహర్, ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, రైతు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఉత్తమ సేవలు అందించాలి

**– జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**– 40 మందికి ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్ల పంపిణీ, అభినందన**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్





ఇన్‌పుట్ డీలర్ల డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులు రైతులకు ఉత్తమ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్ల (డీఏఈఎస్ఐ ) కోర్సు జిల్లాలోని 40 మంది అభ్యర్థులు పూర్తి చేసుకోగా, వారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేసి, అభినందించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. డీఏఈఎస్ఐ కోర్సు, లేదా ఇన్‌పుట్ డీలర్ల కోసం డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్, వ్యవసాయంలో ఇన్‌పుట్ డీలర్ల సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఒక సంవత్సరం డిప్లొమా ప్రోగ్రామ్ రూపొందించి, మేనేజ్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఏఎంఈటీఐ వారి నుంచి శాస్త్రవేత్తలు, అర్హత కలిగిన నిపుణుల ఆధ్వర్యంలో శిక్షణా అందించారని తెలిపారు. నేల ఆరోగ్య నిర్వహణ: వ్యవసాయ ఉత్పాదకతలో నేల ఆరోగ్యం – దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం, ఇంటిగ్రేటెడ్ తెగులు నిర్వహణ పద్ధతులను నేర్చుకోవడం, వ్యవసాయ పనిముట్లు – పరికరాలు: యంత్రాలపై పరిచయం, విస్తరణ విధానాలు– పద్ధతులులి: రైతులతో సమర్థవంతంగా సంభాషించడానికి నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, విత్తన ఉత్పత్తి – నిర్వహణను అర్థం చేసుకోవడం, నీటిపారుదల పద్ధతులను నేర్చుకోవడంపై శిక్షణ అందించారని వివరించారు. ఈ కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసి, రైతులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు శాత్రాజుపల్లి విద్యార్థినులు ఎంపిక

**– సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందించిన ఉపాధ్యాయులు**

వేములవాడ / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొని ప్రతిభ చాటారు. పొన్నాల సాయి ప్రసన్న, పెద్ది గీతిక, వనపర్తి శ్రీనిధి, దురిశెట్టి కీర్తి సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 19, 20 తేదీల్లో నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి తిరిగి వచ్చిన విద్యార్థినులతో పాటు వారిని ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయుడు లింగంపెల్లి రవిని కౌన్సిలర్ ఏనుగు జ్యోతి – తిరుపతి రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ్. శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ఆటల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# శ్రీనివాస కల్యాణ మండపంలో వినాయకుడికి ప్రత్యేక అభిషేకం

**– గణేష్ మండపంలో పూజలు చేసిన వేములవాడ డిఎస్పీ, సీఐ**
**– వాసవి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నవరాత్రోత్సవాలు**

వేములవాడ / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్



గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా వేములవాడలోని శ్రీనివాస కల్యాణ మండపంలో వాసవి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడికి ప్రత్యేక అభిషేక కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, తేనె, పంచామృతాలు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో ఘనంగా అభిషేకాలు జరిపారు. ఈ పూజా కార్యక్రమంలో వేములవాడ డిఎస్పీ శ్రీనివాస్, సీఐ వీరప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గణేష్ నవరాత్రోత్సవాలను భక్తులందరూ ఆధ్యాత్మిక వాతావరణంలో, శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు సిద్ధంశెట్టి వేణు, వాసవి అభ్యుదయ సంఘం అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్, ప్రముఖ వ్యాపారవేత్త నాగబోతు రవీందర్, సుమ కిషన్, చికోటి అశోక్, చాకినాల అశోక్, మద్ది సత్యనారాయణ, పాత శ్రీధర్, కొత్త అనిల్, మొటూరి శ్రీనివాస్, రేణికింది అశోక్, నరాల శ్రీనివాస్, మంచాల రాజశేఖర్, తాటికొండ శ్యామ్, వేణు, కొమురవెల్లి శ్రీనివాస్, ఉప్పుల శతన్న, కొమ్మ నటరాజు, మహిళా సభ్యురాలు మంచాల సౌజన్యతో పాటు వాసవి అభ్యుదయ సంఘం ప్రతినిధులు, మిత్ర బృందం మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యజించిన మహానేతకు ఘన నివాళి

**– కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా స్మరణ సభ**
**– మూడు తరాల తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి బాపూజీ**

వేములవాడ / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్

తెలంగాణ ఉద్యమాలకు జీవితాంతం అంకితభావంతో సేవలందించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా వేములవాడ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పౌరహక్కుల ఉద్యమాలు, నిజాం వ్యతిరేక పోరాటం, క్విట్ ఇండియా ఉద్యమం, వందేమాతరం ఉద్యమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రిపదవికి రాజీనామా చేసి తెలంగాణ ఆకాంక్షలకు అండగా నిలిచారని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస వరకు కృషి చేసిన



నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి కేంద్రబిందువుగా నిలిచిన 'జలదృశ్యం' బాపూజీ ఉద్యమ నిబద్ధతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాళ్లు లిక్కిడి మంజుల, పులి శారదతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరెపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ ఇటిక్యాల రాజు



వేములవాడ / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్

వేములవాడ అర్బన్ మండలంలోని ఆరెపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం స్థానిక సర్పంచ్ ఇటిక్యాల రాజు సందర్శించారు. 'పోషణ మాసం' సందర్భంగా జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహార సేవలు మరియు అక్కడి మౌలిక వసతులను సర్పంచ్ క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రంలో ఎదురవుతున్న పలు సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించిన ఆయన, వాటి తక్షణ పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు మరింత మెరుగ్గా పనిచేస్తూ, అర్హులకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా అన్ని రకాల వసతులు కల్పించాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**– గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 19 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 19 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.





**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....**

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# స్త్రీనిధి రుణ సహాయంతో ఎలక్ట్రిక్ ఆటోల పంపిణీ..

-మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ప్రజాదివాస్

మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధి మెరుగుదల, స్వయం ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి రుణ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం బాన్సువాడ మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి రుణ సహాయంతో కొనుగోలు చేసిన మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోలను కలెక్టర్ పంపిణీ చేశారు.స్త్రీనిధి ద్వారా ఒక్కో లబ్ధిదారునికి రూ.3 లక్షల చొప్పున ఇద్దరు మహిళలకు మొత్తం రూ.6 లక్షల రుణ సహాయం అందించినట్లు అధికారులు తెలిపారు. దేశాయిపేట వీఓ పరిధిలోని సాయి నందిని గ్రూప్‌కు చెందిన మాసన్‌పల్లి రజిత, సోమలింగేశ్వర గ్రూప్‌కు చెందిన బేపారి శోభ లబ్ధిదారులుగా ఉన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ అవసరాలకు అనుగుణంగా స్త్రీనిధి ద్వారా పొందుతున్న రుణాలను ఆదాయం సమకూర్చే ఉపాధి మార్గాలకు వినియోగించుకోవాలని సూచించారు. ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా నిరంతర ఆదాయం పొందుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని అన్నారు.మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం వివిధ రకాల రుణ సహాయ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని మరింత మంది మహిళలు స్వయం ఉపాధి కార్యకలాపాల వైపు ముందుకు రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, అదనపు డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీఆర్వో పాండు, స్త్రీనిధి ఆర్ఎం కిరణ్, స్త్రీనిధి మేనేజర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్, సంబంధిత అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి..

-పునరావాస ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేయాలి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాదివాస్

సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, నిర్వాసిత కుటుంబాల పునరావాస ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాల వారీగా సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిని మంత్రి సమీక్షించారు. ప్రాజెక్టుల వారీగా సేకరించాల్సిన భూమి, ఇప్పటికే పూర్తయిన భూసేకరణ, పెండింగ్‌లో ఉన్న కేసుల ప్రస్తుత పరిస్థితిపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.అలాగే ప్రాజెక్టుల కింద నిర్వాసిత కుటుంబాలకు చేపట్టాల్సిన పునరావాసం, పునర్వ్యవస్థీకరణ చర్యలపై సమీక్షించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు, పరిహారం చెల్లింపు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. భూసేకరణతో పాటు పునరావాస ప్రక్రియను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, అటవీ శాఖకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా సమీక్షించి, పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.
వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజు, భూసేకరణ--పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు, ఇంజినీర్-ఇన్-చీఫ్ రమేష్‌బాబు, నీటిపారుదల




శాఖ సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
కామారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అటవీ అధికారి సూరజ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, సెక్షన్ ఆఫీసర్ వరప్రసాద్, శిక్షణలో ఉన్న డిప్యూటీ కలెక్టర్ రవితేజ, నీటిపారుదల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డీజేలకు దూరంగా ఉండండి ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు నిర్వహించండి..

-డీజే నిర్వాహకులతో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర సమావేశం

ప్రజాదివాస్

కామారెడ్డి జిల్లాలో జరగనున్న గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని డీజే నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఆయన నిబంధనలను వివరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లాలోని ప్రతి ఒక్కరినీ తన కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని, ప్రజల క్షేమం, భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భారీ జనసమూహంతో జరిగే గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు.గత ఏడాది కామారెడ్డి పట్టణంలో డీజేలు లేకుండా




సంప్రదాయ డప్పులు, వాయిద్యాలు, నృత్యాలతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని గుర్తుచేశారు. అదే స్ఫూర్తిని ఈ ఏడాది కూడా కొనసాగించాలని గణేష్ మండళ్లకు, నిర్వాహకులకు సూచించారు. డీజేల వల్ల శబ్ద కాలుష్యంతో పాటు ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని డీజేలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.గౌరవనీయ సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, పోలీస్ శాఖ నిబంధనల ప్రకారం జిల్లాలో డీజే వినియోగంపై నిషేధం అమల్లో ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. డీజే నిర్వాహకులు గణేష్ ఉత్సవ కమిటీల నుంచి ఎలాంటి అడ్వాన్స్‌లు తీసుకోవద్దని సూచించారు. ఇప్పటికే అడ్వాన్స్‌గా డబ్బులు తీసుకున్న వారు వెంటనే సంబంధిత నిర్వాహకులకు తిరిగి చెల్లించాలని ఆదేశించారు.నిబంధనలు తెలిసినప్పటికీ ఎవరైనా డీజే ఏర్పాటు చేసి వినియోగిస్తే సంబంధిత నిర్వాహకులు, డీజే ఆపరేటర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీజే సౌండ్ సిస్టమ్‌లను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు.గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపడుతోందని ఎస్పీ తెలిపారు. భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని, అయితే తమ ఆనందం ఇతరులకు ఇబ్బందిగా మారకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణకు ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

# రెడ్‌క్రాస్ ఎన్నికల నోటిఫికేషన్‌లో సవరణ..

ప్రజాదివాస్

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించి సవరణ ప్రకటన జారీ చేసింది. సెప్టెంబర్ 20న వివిధ దినపత్రికల్లో ప్రచురితమైన ఎన్నికల నోటిఫికేషన్‌లో "గుర్తుల కేటాయింపు" ఉంటుందని తప్పుగా ప్రచురించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.
ఈ ఎన్నికల్లో ఎలాంటి గుర్తుల కేటాయింపు ఉండదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పాఠకులు, రెడ్‌క్రాస్ సభ్యులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ గమనించాలని కోరారు. ఈ మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ ఎన్నికల అధికారి సవరణ ప్రకటన విడుదల చేశారు.


INDIAN RED CROSS SOCIETY
భారతీయ రెడ్ క్రాస్ సొసైటీ
KAMAREDDY DISTRICT BRANCH, TELANGANA | కామారెడ్డి జిల్లా శాఖ, తెలంగాణ
స్థలం / Place: కామారెడ్డి / Kamareddy
తేదీ / Date: 20.09.2026

పత్రికా ప్రకటన (PRESS NOTE)
సవరణ

20.09.2026 తేదీన వివిధ దినపత్రికలలో ప్రచురితమైన "ది ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి డిస్ట్రిక్ట్ బ్రాంచ్ తెలంగాణ" ఎలక్షన్ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలలో "గుర్తుల కేటాయింపు" (Allotment of Symbols) అని తప్పుగా ప్రచురించబడినది.

కానీ ఈ ఎన్నికలలో ఎటువంటి గుర్తుల కేటాయింపు ఉండదు (No Allotment of Symbols) కావున పాఠకులు మరియు అభ్యర్థులందరూ గమనించగలరు.

ఇట్లు,
ఎన్నికల అధికారి (Election Officer)
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ
కామారెడ్డి జిల్లా.

PRESS NOTE (ENGLISH)
CORRIGENDUM

In the Election Notification of "The Indian Red Cross Society, Kamareddy District Branch, Telangana" published in various daily newspapers on 20.09.2026, it was erroneously printed as "Allotment of Symbols".

It is hereby clarified that there will be No Allotment of Symbols for these elections. Readers, members, and contesting candidates are requested to kindly take note of this correction.

Sd/-
Election Officer
Indian Red Cross Society
Kamareddy District.

# వేములవాడలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- పేదలకు అండగా సీఎం సహాయ నిధి: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



వేములవాడ / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్

వేములవాడ పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను సోమవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాసంలో అందజేశారు. వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మ మధు చేతుల మీదుగా లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న పేదలకు ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా భరోసా కల్పిస్తోందని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు కుక్కుల బాలకృష్ణ, కాస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సాయి రూప ట్రస్ట్ అన్నప్రసాదం వేదిక అన్నదాత సుఖీభవ

వేములవాడ / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్



వేములవాడ పట్టణంలోని ఈరోజు మధ్యాహ్నం నిరాశ్రయులకు మరియు ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులకు, వీధియాచకులకు అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా రాజన్న ఆలయం ఆవరణంలో సాయిరూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు పిల్లీ బాబురావు మాట్లాడుతు వారి పేరు మీద అన్న ప్రసాదం ఈ రోజు యాచాకులకి పంపిణి చేయడం జరిగింది అలాగే ప్రతి దాతలకు పేరు పేరు నా ధన్యవాదములు ఈ రోజు మాకు సహకరించిన దాతలు కరీంనగర్ వాస్తవ్యులైన అడిగొప్పుల విద్యశ్రీ గారి పుట్టినరోజు సందర్బంగా మాకు ఈ కార్యక్రమం సహకరించారు ఈ కార్యక్రమం లో వ్యవస్థాపికులు ఎద్దండి రాజు ,వేముల సతీష్ ,వాసాల హరిప్రసాద్ ,గౌశీటీ నవీన్ ,తదితరులు పాల్గొన్నారు..." అన్నం పరబ్రహ్మ స్వరూపం ""దయచేసి ఆహారాన్ని వృధా చేయకండి,"

# రాజన్న సిరిసిల్లలో కొండ లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు



రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 21 ప్రజాదివాస్

సిరిసిల్లలోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తాలో ఆయన వర్ధంతి సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళ చక్రపాణి ఘన నివాళు లర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటంలో బాపూజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన తొలి మంత్రిగా నిలిచారని అన్నారు. పద్మశాలీల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ నెల 27న జయంతి వేడుకలను నిర్వహించాలని కోరారు.

# స్వర్ణగిరి టెంపుల్ నమూనాలో గణేష్ మండపం..

-జిల్లా ఎస్పీ ప్రత్యేక పూజలు

ప్రజాదివాస్



కామారెడ్డి పట్టణంలో వాయిసేన యూత్ ఆధ్వర్యంలో స్వర్ణగిరి టెంపుల్ నమూనాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని జిల్లా ఎస్పీ శ్రీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ ఉత్సవ నిర్వాహకులతో ఎస్పీ మాట్లాడి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసుల సూచనలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సాంప్రదాయ వాయిద్యాలతో భక్తిశ్రద్ధలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని ఎస్పీ కోరారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించడంతో పాటు నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, కామారెడ్డి టౌన్ ఎస్‌హెచ్ఓ బి. నరహరి, పోలీస్ సిబ్బంది, వాయిసేన యూత్ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# లింగంపేట్ హత్య కేసును ఛేదించిన పోలీసులు..

- నిందితుడి అరెస్ట్.. ఇనుప రాడ్, సెల్‌ఫోన్, రక్తపు మరకలున్న దుస్తులు స్వాధీనం

ప్రజాదివాస్

కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలంలోని నాగారం గ్రామ శివారులో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ ఎస్. శ్రీనివాస్ రావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం గ్రామానికి చెందిన ఓ మహిళ గత కొంతకాలంగా కొరుపోలుకు చెందిన గుట్టమీది సాయిలు (48)తో సహజీవనం చేస్తోంది. హైదరాబాద్‌లోని గుండ్లపోచమ్మ ప్రాంతంలో ఉన్న సమయంలో సాయిలు తన గ్రామానికి రావాలని ఆమెను పలుమార్లు ఫోన్‌లో బెదిరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో సెప్టెంబర్ 18న భూమికి సంబంధించిన డబ్బులు వస్తాయని, పొలానికి మందు చల్లించాల్సి ఉందని చెప్పి ఆమె అక్కడి నుంచి బయలుదేరింది. అనంతరం నాగారం గ్రామ శివారులో తలకు బలమైన గాయాలతో రక్తస్రావమై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీనిపై మృతురాలి తల్లి చింతకుంట చంద్రవ్వ లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి డీఎస్పీ ఎస్. శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో, ఎల్లారెడ్డి సీఐ డి. రాజారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొరుపోలు గ్రామానికి చెందిన గుట్టమీది సాయిలును అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో మృతురాలిపై ఇనుప రాడ్‌తో దాడి చేసినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. భూమి డబ్బుల విషయమై మృతురాలిని ద్విచక్ర వాహనంపై కామారెడ్డికి తీసుకెళ్లి జుబేర్‌తో మాట్లాడించిన అనంతరం తిరిగి పొలం వద్దకు తీసుకెళ్లినట్లు వెల్లడించారు. అక్కడ ఇద్దరి మధ్య మాటామాటా జరిగిన సమయంలో నిందితుడు తన వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్‌తో దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి ఒక (ఒప్పో) సెల్‌ఫోన్, హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్, రక్తపు మరకలున్న దుస్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు ప్రస్తుతం నేర విచారణలో ఉందని పోలీసులు తెలిపారు. కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన ఎల్లారెడ్డి సీఐ డి. రాజారెడ్డి, లింగంపేట్ ఎస్సై పి. దీపక్ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అభినందించారు. కేసు దర్యాప్తును సమర్థవంతంగా పూర్తి చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



# ఓటర్ల దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి..

-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

ప్రజాదివాస్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా స్వీకరించిన దరఖాస్తులు, వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటరు నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణకు సంబంధించి ఎన్నికల అధికారుల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అవసరమైన విచారణలను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, జారీ చేసిన నోటీసులు సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. కామారెడ్డి ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, ఆర్డీవోలు, తహసీల్దార్ హిమబిందు, ఎలక్షన్ సెక్షన్ అధికారి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




# గర్గుల్‌లో గణపతికి ప్రత్యేక పూజలు..

-అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

ప్రజాదివాస్



కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పర్యటించారు. గ్రామంలోని వివిధ గణేష్ మండపాలను సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యతను పెంపొందించాలని అన్నారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు, గ్రామ ఉపసర్పంచ్ ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు జగదీశ్వర్, గూడెం బాలరాజు తదితరులు గంప గోవర్ధన్‌ను ఘనంగా సన్మానించారు. అంతకుముందు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపిగౌడ్, చిందం మల్లేష్, కొట్టాలపల్లి శ్యామ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కాసర్ల గోదారి స్వామి, కౌన్సిలర్ ఆఫీస్ లొల్లం శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు బలవంతరావు, పాత హనుమాన్లు, కృష్ణాజిల్లా కొత్తింటి శ్రీనివాస్‌రెడ్డి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి గుమ్మం దాటగానే.. ప్రైవేట్ ఆసుపత్రుల బాటనా..!

- డ్యూటీ వైద్యుల రిఫర్లపై పలు ఆరోపణలు
- ప్రైవేట్ అంబులెన్సుల హల్చల్‌పై అనుమానాలు
- పేద రోగులపై అదనపు ఆర్థిక భారం

ప్రజాదివాస్

పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాల్సిన బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. అత్యవసర వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను కొందరు డ్యూటీ వైద్యులు అవసరం లేకపోయినా ప్రైవేట్ ఆసుపత్రులకు పంపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో ప్రైవేట్ అంబులెన్సులు పెద్ద సంఖ్యలో తిరుగుతుండటం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించే విషయంలో కొందరు అంబులెన్స్ నిర్వాహకుల పాత్రపై కూడా ఆరోపణలు వెలువడుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలపై అవగాహన లేక, వైద్యుల సూచనలతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే పేద రోగులు చివరకు అదనపు వైద్య ఖర్చులను భరించాల్సి వస్తోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నిబంధనల ప్రకారం అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయా? అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారా? ప్రైవేట్ అంబులెన్సులు ఆసుపత్రి ప్రాంగణంలో ఎందుకు సంచరిస్తున్నాయి? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో నిరాధార ఆరోపణలు ఉంటే వాటిపై కూడా స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. పేదలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా వైద్య సేవలు పారదర్శకంగా అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



14

# సాంప్రదాయబద్ధంగా శోభాయాత్ర

- ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం..

ప్రజాదివాస్

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని గణేష్ నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరిగింది. స్థానిక విఠలేశ్వర ఆలయంలో ఏడు రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న గణనాథుడిని సోమవారం భక్తులు ఘనంగా సాగనంపారు. ఈ సందర్భంగా భజనలు, కీర్తనలు, కోలాటాలతో సాంప్రదాయబద్ధంగా శోభాయాత్ర నిర్వహించారు. యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపయ్యకు వీడ్కోలు పలికారు. అనంతరం స్థానిక బాజన్ చెరువులో గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది.



# సీసీ కెమెరాలు సమాజ భద్రతకు కీలక రక్షణ కవచాలు..

**-16 నూతన సీసీ కెమెరాలను ప్రారంభించిన డీఎస్పీ ఎస్. మధుసూదన్**

ప్రజాదివాస్
ప్రజా భద్రత, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్ అన్నారు. రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామంలో గ్రామ ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన 16 నూతన సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వీధి, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను నియంత్రించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలను అరికట్టవచ్చన్నారు. దొంగతనాలు, ఈవ్‌టీజింగ్ తదితర ఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను త్వరగా గుర్తించి కేసులను ఛేదించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, నేరాల గుర్తింపు, నిందితుల అరెస్టులోనూ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వల్ల భద్రత మరింత బలోపేతం అవుతుందని అన్నారు. బస్వన్నపల్లిలో కెమెరాల ఏర్పాటుకు చొరవ చూపిన సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, యువత, గ్రామ ప్రజలను జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజా భద్రత పట్ల వారు చూపిన బాధ్యత, సమిష్టి చొరవ అభినందనీయమన్నారు. బస్వన్నపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని జిల్లాలోని ఇతర గ్రామాల సర్పంచులు, పాలకవర్గాలు, యువత, ప్రజలు కూడా ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ప్రజలు, పోలీసులు సమన్వయంతో పనిచేస్తే గ్రామీణ ప్రాంతాల్లో నేరాలను మరింత సమర్థవంతంగా నియంత్రించవచ్చన్నారు. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న దొంగతనాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. రాత్రివేళ ఇంటికి తాళం వేసి డాబాలపై నిద్రించకుండా ఇంట్లోనే నిద్రించాలని, తాళం చెవులను ఇంటి పైభాగంలో, గోడలపై లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉంచవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామంలో ఏర్పాటు





చేసిన సీసీ కెమెరాలను గ్రామ ఆస్తిగా భావించి ప్రతి ఒక్కరూ సంరక్షించాలని, వాటి పనితీరుకు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. బస్వన్నపల్లి గ్రామ ప్రజలు తీసుకున్న ఈ చొరవ జిల్లాలోని ఇతర గ్రామాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్వైజర్. ఎస్ పి ఎస్ మెడికల్. డ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా సిద్దెల తిరుమలరావు

ప్రజాదివాస్
కొత్తగూడెం :జిల్లా నూతన కమిటీ ని రాష్ట్ర అధ్యక్షులు కుర్రి సైదయ్య రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్ గాడ్ల ఆధ్వర్యంలో ఎన్ని కోవడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 18,000 మంది కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రి నందు శానిటేషన్ పేషెంట్ కేర్ , సెక్యూరిటీ సూపర్వైజర్ గా విధులు నిర్వహిస్తూ సరైన గుర్తింపు లేక చాలీచాలని జీతాలతో జీవన విధానం వెళ్లదీస్తున్నారు అని ఆవేదన వ్యక్తపరిచినారు 2022 జీవో ప్రకారము ఆనాడు ఇచ్చిన ఏజెన్సీ విధానం మేరకు 15600/- జీతం ఉండగా చాలా ప్రభుత్వ ఆసుపత్రిలో హాస్పటల్ అధికారులు ఏజెన్సీ కాంట్రాక్టర్లు కుమ్మక్కై మా కార్మికులకు 10,000/- ,10, 500/- , 11,000/- జీతాలు ఇస్తున్నారు అని మండిపడినారు ఈపీఎఫ్ ఈఎస్ఐ కూడా కార్మికులకు కొన్ని ఏజెన్సీలో కట్టడం లేదు అని ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శాఖ మంత్రి ఆరోగ్య శాఖ ఉన్నంత అధికారులు మా కార్మికులందరికీ కూడా ఐ ఎఫ్ ఎం ఎస్ లో విలీనం చేసి కనీస వేతనం నెలకు 26000 ఇవ్వాలి అని డిమాండ్



చేసినారు .తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాల నందు మా కార్మికులందరినీ ఏకతాటి చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాము అని హెచ్చరించినారు. నూతనంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పిఎస్ కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఈదునూరి అనిల్ గౌరవ సలహాదారులు అశ్వరావుపేట వెంకటేశ్వర్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ అధ్యక్షులుగా సిద్దేల తిరుమలరావు జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శిగా దాట్ల శ్రావణ్ కుమార్ జిల్లా కమిటీ కోశాధికారిగా దొంగరి హైమావతి జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా దేవకరణ గంగా ,టేకుల రమేష్. జి . మమత జిల్లా కమిటీగా సహాయ కార్యదర్శిలు బండారి లక్ష్మి ,కె పవన్ ఎమ్ .డీ .వెంకటరమణ జిల్లా కమిటీ ప్రచార





కార్యదర్శులుగా బాలు అనిత , భాగ్యలక్ష్మి తదితరులతో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ కోశాధికారి పత్తిపాటి శ్రీనివాస్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులుగా మాతంగి అనిల్ కుమార్ రాష్ట్ర కమిటీ ప్రచార కార్యదర్శి ప్రసాద్ రాష్ట్ర కమిటీ సభ్యులు చాగంటి నాగమణి సూర్యాపేట జిల్లా కమిటీ అధ్యక్షులు నాగభూషణం ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్షులు బక్తుల మమత ఖమ్మం జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా గుగ్గిళ్ళ నాగేంద్ర ఖమ్మం జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి గద్దల కళ్యాణి వివిధ ప్రభుత్వ ఆస్పటల్ నుండి పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ కులాలు కోల్పోయిన స్వతంత్ర హక్కులు కల్పించాలని నిరసన ప్రదర్శన

ప్రజాదివాస్
టేకులపల్లి మండలం ముత్యాలంపాడు మాల పల్లెలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహిళలు,పురుషులు, యువకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. వీధుల పొంటి ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు స్థానిక రిజర్వేషన్ ఎంపీటీసీ, జెడ్పిటిసిలు,స్థానిక ఉద్యోగ నియామకాలు,నివాస ఇంటిపై ,సాగు భూములకు ఆంక్షలు లేకుండా హక్కులు కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక షెడ్యూల్డ్ కులాల జనాభా పెరిగినందున షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ 20% పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బిఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో తొలగించిన స్థానిక షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెనుకబడ్డ ఏజెన్సీ ప్రాంతం పేరుతో అభివృద్ధిలో వెనుకబడ్డ ఎస్సీ కులాలరాజ్యాంగపరమైన స్వతంత్ర హక్కులు రిజర్వేషన్ జనరల్ లో కలపడాన్ని ఖండించారు. 2023 ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్ర పీసీసీ ప్రెసిడెంట్ హోదాలో ఈనాటి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల ఉద్యమం దశలవారీగా ఉధృతం చేస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వానికి కనువిప్పు కలిగించడానికి గ్రామ గ్రామాన నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడ రమేష్,రాష్ట్ర గౌరవ అడ్వైజర్ సింగరేణి ఎక్స్ జి ఎం సెనగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎస్సీ యూత్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కర్లపూడి సుందర్ పాల్,దేవదానం,ముచ్చు సుధాకర్,జి రాగన్ బాబు, సెనగ స్వామి,అంతోటి జానకిరామ్,తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారె



ప్రజాదివాస్
యాతాలకుంట టన్నెల్ పనుల పర్యవేక్షణ.. చాపరాలపల్లి వద్ద హై లెవెల్ బ్రిడ్జికి శంకుస్థాపన అశ్వారావుపేట: సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా రాష్ట్ర వ్యవసాయ, చేనేత, మార్కెటింగ్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం వివిధ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ముందుగా యాతాలకుంట వద్ద కొనసాగుతున్న సీతారామ ప్రాజెక్టు టన్నెల్ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల వివరాలను అధికారులు వారికి వివరించారు. అనంతరం ములకలపల్లి మండలం చాపరాలపల్లి వద్ద నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ శంకుస్థాపన చేశారు. ఈ వంతెన నిర్మాణంతో ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. తదుపరి కమలాపురం వద్ద నిర్మించిన సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు. సీతారామ ప్రాజెక్టు పనుల ద్వారా సాగునీటి సౌకర్యాలు మెరుగుపడి, రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 22న హోమ చూర్ణం మరియు నెయ్యి పంపిణీ





ప్రజాదివాస్
25న ప్రకాశం స్టేడియంలో గణేష్ నిమర్జన పూజగణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు యెర్రా కామేష్ కొత్తగూడెం. ఈనెల 22వ తేదీన గణపతి మండపాలు ఏర్పాటు చేసిన వారికి ఉచితంగా హోమ చూర్ణం మరియు ఆవు నెయ్యి పంపిణీ చేయడం జరుగుతుందని గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు న్యాయవాది యెర్రా కామేష్ తెలిపారు. సోమవారం వివేకానంద హైస్కూల్ నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు 22వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కల్లా వివేకానంద హైస్కూల్ కు చేరుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేసే హోమ చూర్ణం మరియు ఆవు నెయ్యి పంపిణీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 25వ తేదీన నిమర్జన కార్యక్రమం స్థానిక ప్రకాశం స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు పూజాకార్యక్రమం అనంతరం ప్రకాశం స్టేడియం నుండి శోభాయాత్ర ప్రారంభమై సూపర్ బజార్ సెంటర్ లో ఏర్పాటు చేసిన స్టేజ్ వద్ద గణనాధులకు స్వాగత ఏర్పాట్లు చేయడం జరిగిందని,గణేష్ ఉత్సవాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు కొత్తగూడెంలో జరిగే శోభాయాత్రలో పాల్గొనుటకు మధ్యాహ్నం 3 గంటల కల్లా స్థానిక ప్రకాశం స్టేడియం గ్రౌండ్ కు చేరుకొని నిర్వాహకులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పలివేల సాంబశివరావు,ఆంధ్రప్రభ లక్ష్మణ్,ప్రధాన కార్యదర్శి దారా రమేష్,మెరుగు చింతేశ్వర్,అవుటుపల్లి రాంబాబు,కుడిక్యాల సమ్మయ్య,ఆకుల యాకయ్య తదితరులు పాల్గొన్నారు